

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 26-04-2026 | సంపుటి - 27 | సంచిక -333 | రూ : 4 | పేజీలు: 8

## గణపతి దండకారణ్యంలో లేడు

- పట్టణాల్లోనే ఉన్నట్టు సమాచారం
- అత్యధికంగా 818 మంది మావోయిస్టులు లొంగిపోయింది మన రాష్ట్రంలోనే
- మిగిలినవారు కూడా త్వరలో సరెండరవుతారు : ప్రెస్ కాన్ఫరెన్స్‌లో డీజీపీ ప్రకటన
- ఆయుధాలతో సహా లొంగిపోయిన 47 మంది మావోయిస్టులు

2లో






## శ్రీహరికోటకు విక్రమ్-1 రాకెట్..

2లో

# జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్

- హైదరాబాద్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ ప్రస్థానం ప్రారంభం.
- మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో రాకెట్ వాహనాన్ని సాగనంపిన సీఎం రేవంత్ రెడ్డి.
- త్వరలో శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి నింగిలోకి విక్రమ్-1.
- అంతరిక్ష రంగంలో హైదరాబాద్ ఖ్యాతిని చాటిచెప్పిన స్కైరూట్ ఏరోస్పేస్

## పాక్ పర్యటనకు ట్రంప్ నో ఇరాన్ చర్చలపై ఆంక్షలు



2లో

- ఇరాన్‌తో చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన ప్రతినిధుల పర్యటన రద్దు
- ట్రూత్ సోషల్ వేదికగా పర్యటన రద్దును ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్
- మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే చాలని ఇరాన్‌కు సూచన
- ఇరాన్ నాయకత్వంలో గందరగోళం ఉందని ట్రంప్ విమర్శ
- అమెరికాతో నేరుగా భేటీ అయ్యేది లేదని ఇరాన్ ముందే స్పష్టం




## డిజిటల్ చెల్లింపులు.. కొత్త నిబంధనలు!

- డిజిటల్ వ్యాలెట్లు, ప్రీపెయిడ్ కార్డుల కోసం ఆర్‌బీఐ కొత్త ముసాయిదా విడుదల
- వినియోగదారుల భద్రత, పారదర్శకత పెంచడమే ప్రధాన లక్ష్యం
- లావాదేవీల పరిమితులు, నాన్‌బ్యాంక్ సంస్థల నికర విలువపై కొత్త నిబంధనలు
- విఫలమైన లావాదేవీల సొమ్మును వెంటనే రిఫండ్ చేయాలని స్పష్టం
- అన్ని ఛార్జీలను స్థానిక భాషలో స్పష్టంగా తెలపాలని ఆదేశం

2లో

## కవిత కొత్త పార్టీ ‘తెలంగాణ రాష్ట్ర సేన’ ఆవిర్భావం

- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన కవిత
- బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్న ఆరోపణ
- కేసీఆర్ మారిపోయారని, ఆయన మన మనిషి కాదంటూ తీవ్ర విమర్శలు
- సామాజిక తెలంగాణే లక్ష్యమని, రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా
- తప్పకుండా తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేసిన కవిత

2లో







## ఆర్టీసీ ఉద్యోగులకు వేతన పండుగ

# భారీగా పెరగనున్న జీతాలు!

- రిటైరైన వారికీ ప్రయోజనం
- 2021 ఏప్రిల్ 1 నుంచి వేతన సవరణ
- బకాయిలు రిటైర్మెంట్ సమయంలో చెల్లింపు
- 11% ఫిట్‌మెంట్‌తో భారం రూ.2,400 కోట్లపైనే..
- కండక్టర్లకు రూ.4,000-15,000, డ్రైవర్లకు రూ.4,000-17,000 వరకు పెరుగుదల

2లో





## మెట్రో స్వాధీనానికి వేగంగా అడుగులు

- నిర్వహణకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నియామకం
- ఛైర్మన్‌గా సీఎస్ రామకృష్ణారావు.. ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ మొదటి దశ స్వాధీన ప్రక్రియలో ప్రభుత్వం వేగం పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోని (పీపీపీ) మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం హస్తగతం చేసుకునేందుకు చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. ఎల్అండ్‌టీ మెట్రోరైలు (హైదరాబాద్) లిమిటెడ్‌కు చెందిన వందశాతం ఈక్విటీ వాటాల కొనుగోలు అనంతరం ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ బోర్డు నిర్వహణ కోసం ప్రభుత్వం కీలక అధికారులను నామినేట్ చేసింది.

తరువాయి 2లో

# మీడియా వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం పెంచాలి

*** మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ప్రజాస్ఫూర్తి : మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరం లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓను అనుసరించి నిబంధనలు పాటించాలని అన్నారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా






జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు కమిటీ సభ్యులు అక్రిడిటేషన్ ప్రక్రియ గురించి తమ అనుభవాలను పంచుకొని, ఈ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు మోతె వెంకట్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, రవిచందర్, రామారావు, ప్రసాద్, భూపాల్,అబ్దుల్ సామీ, మహామ్ముద్, డిపిఆర్వో స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్రో స్వాధీనానికి వేగంగా అడుగులు

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ మొదటి దశ స్వాధీన ప్రక్రియలో ప్రభుత్వం వేగం పెంచింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోని (పీపీపీ) మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం హస్తగతం చేసుకునేందుకు చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. ఎల్అండ్టీ మెట్రోరైలు (హైదరాబాద్) లిమిటెడ్కు చెందిన వందశాతం ఈక్విటీ వాటాల కొనుగోలు అనంతరం ఎల్అండ్టీ ఎంఆర్హెచ్ఎల్ బోర్డు నిర్వహణ కోసం ప్రభుత్వం కీలక అధికారులను నామినేట్ చేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శనివారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. బోర్డు డైరెక్టర్ల నియామకంతో పాటు నిబంధనల ప్రకారం నామినీ షేర్ హోల్డర్లకు షేర్ల కేటాయింపు ప్రక్రియను కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎల్అండ్టీ మెట్రోరైలు (హైదరాబాద్) లిమిటెడ్లోని వందశాతం ఈక్విటీ వాటాను రూ.15 వేల కోట్లు వెచ్చించి (అప్పులతో కలిపి) స్వాధీనం చేసుకోవాలని హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ లావాదేవీకి ఈ నెల 30 గడువుగా నిర్ణయించింది. స్వాధీనం అనంతరం ఎల్అండ్టీ ఎంఆర్హెచ్ఎల్ బోర్డుకు డైరెక్టర్ల నియామకం, నామినీ షేర్ హోల్డర్లకు వాటాల కేటాయింపు కోసం హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. క్షుణ్ణంగా పరిశీలించిన మీద.. ప్రభుత్వం వాటాల కొనుగోలు అనంతరం మెట్రోరైలు నిర్వహణకు కొత్త బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ను నామినేట్ చేసింది. ఛైర్మన్గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉండనున్నారు. ఎల్అండ్టీ ఎంఆర్హెచ్ఎల్లో వాటాల పంపిణీని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం కూడా ఒక నామినీ షేర్హోల్డర్గా ఉండనుంది. ఛైర్మన్, ఎండీ, నలుగురు డైరెక్టర్లు, తెలంగాణ ప్రభుత్వానికి నామమాత్రంగా ఒక్కో షేరు కేటయించగా, మిగిలిన షేర్లను హెచ్ఎంఆర్ఎల్ కలిగి ఉంటుందని పేర్కొంది. దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

**డైరెక్టర్లుగా కీలక అధికారులు..**

బోర్డులో ఛైర్మన్, ఎండీ కాకుండా ఎనిమిది మంది డైరెక్టర్లు ఉంటారు. ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్ (హెచ్ఎంఆర్ఎల్ ఎండీ), డైరెక్టర్లుగా జయేశ్రంజన్ (ఎంఏయూడీ), వికాస్ రాజ్ (ఆర్అండ్బీ), సందీప్కుమార్ సుల్తానియా (ఆర్థికశాఖ), బి.శివధర్రెడ్డి (డీజీపీ), సర్ఫరాజ్ అహ్మద్ (హెచ్ఎండీఏ కమిషనర్), కె.అశోక్రెడ్డి (జలమండలి ఎండీ), జితేశ్ వీ పాటిల్ (ఎస్పీడీసీఎల్ సీఎండీ), శివేంద్ర ప్రతాప్ (హెచ్ఎంఆర్ఎల్ జేఎండీ) లను ప్రభుత్వం నియమించింది.

## ఆర్టీసీ ఉద్యోగులకు వేతన పండుగ: భారీగా పెరగనున్న జీతాలు!

హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో సంస్థలోని 37,360 మందికి ప్రయోజనం కలగనుంది. 2021 ఏప్రిల్ 1 నుంచి అమలుచేయాలని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించాయి. ఆర్టీసీ ఉద్యోగులకు 11 శాతం ఫిట్మెంట్ ఇస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహా మంత్రుల బృందం శుక్రవారం అర్ధరాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు 2021 ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన వారికి సైతం ఈ ప్రయోజనం లభించనుంది. వారి సర్వీసును బట్టి కండక్టర్లకు రూ.4,00015,000, డ్రైవర్లకు రూ.4,000 17,000 వరకు వేతనాలు పెరుగుతాయని కార్మికవర్గాలు తెలిపాయి.

**సంస్థపై భారీగా ఆర్థిక భారం**

ఆర్టీసీ ఐకాస 32 డిమాండ్లలో అతి ప్రధానమైనది వేతన సవరణ. ఆర్టీసీ యాజమాన్యం 5, 8, 10 శాతం ఫిట్మెంట్తో వేతన సవరణ ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి సమర్పించింది. చర్చల సందర్భంగా 10 శాతానికి ప్రభుత్వం అంగీకరించి ప్రకటనకు సిద్ధమవుతున్న తరుణంలో ఆర్టీసీ ఐకాస నేతలు 12 శాతం ఇవ్వాలని పట్టుబట్టారు. మళ్లీ గంటన్నర పాటు చర్చలు జరిగాయి. చివరకు 11 శాతం ఫిట్మెంట్కు ప్రభుత్వం అంగీకరించింది. వేతన సవరణతో ఆర్టీసీపై ఆర్థిక భారం భారీగా పడనుంది. 2021 ఏప్రిల్ నుంచే అమలు చేయాల్సి ఉండటంతో ఐదు సంవత్సరాల బకాయిలు చెల్లించాలి. ప్రసుత్తం పనిచేస్తున్న ఉద్యోగులకే రూ.2,178 కోట్ల పైచిలుకు చెల్లించాల్సి ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి నివేదించింది. విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సింది రూ.230 కోట్లు. మొత్తంగా రూ.2,400 కోట్లకుపైనే భారం పడుతుందని ఆర్టీసీ ఉన్నతాధికారులు లెక్కలు వేశారు. మరోవైపు ప్రతినెలా ఉద్యోగులకు చెల్లించే వేతనాల ఖర్చు పెరగనుంది. 11 శాతం ఫిట్మెంట్తో ప్రతి నెలా అదనంగా వేతనాల కోసం రూ.34.6 కోట్లు చెల్లించాలని ఆర్టీసీ యాజమాన్యం లెక్కలు వేసింది. సంవత్సరానికి జీతాల అదనపు భారం రూ.415.2 కోట్లు అని అధికారులు అంచనా వేశారు.

*** విశ్రాంత ఉద్యోగులకు ముందుగా చెల్లింపు**

ఫిట్మెంటు బకాయిలు 2021 ఏప్రిల్ తర్వాత రిటైర్ అయినవారికి ముందు చెల్లిస్తారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారికి పదవీ విరమణ సమయంలోనే ఇవ్వాలని నిర్ణయించినట్లు కీలక అధికారి ఒకరు తెలిపారు. గతంలో వేతన సవరణ జరిగినప్పుడు ఇదే విధంగా చేశామని ఆర్టీసీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. వేతన సవరణ ప్రయోజనం పొందే ఉద్యోగుల సంఖ్య సైతం భారీగానే ఉంది. 202122లో ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య 46,988. ప్రస్తుతం ఆ సంఖ్య 37,360. అంటే లబ్ధి పొందే విశ్రాంత ఉద్యోగుల సంఖ్య 9,600కు పైనే ఉంటుంది.

## పాక్ పర్యటనకు ట్రంప్ నో.. ఇరాన్ చర్చలపై ఆంక్షలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్తో చర్చల నిమిత్తం తమ ప్రతినిధుల బృందం పాకిస్థాన్లోని ఇస్లామాబాద్కు వెళ్లాల్సి ఉండగా, ఆ పర్యటనను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. చర్చల కోసం అంత దూరం ప్రయాణించడం సమయం వృథా అని, వాళ్లు మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్తో సమావేశం కోసం ఇస్లామాబాద్ వెళుతున్న నా ప్రతినిధుల పర్యటనను ఇప్పుడే రద్దు చేశాను. ప్రయాణంతో సమయం వృథా అవుతుంది. ఫలితం లేని చర్చల కోసం అంత దూరం వెళ్లడం అనవసరం. పైగా, ఇరాన్ నాయకత్వంలో తీవ్ర గందరగోళం, అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయి. ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా ప్రతినిధులతో నేరుగా సమావేశమయ్యే ప్రణాళిక ఏదీ లేదని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతోనే తమ అభిప్రాయాలు తెలియజేస్తామని చెప్పింది. ఈ ప్రకటన తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వంలోని బృందం పాకిస్థాన్ నుంచి బయలుదేరి వెళ్లిపోయింది. ఈ పరిణామాల తర్వాతే ట్రంప్ తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. "అన్ని అస్త్రాలు మా చేతిలోనే ఉన్నాయి, వాళ్ల చేతిలో ఏమీ లేదు. ఒకవేళ వాళ్లు మాట్లాడాలనుకుంటే, చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే!" అని ట్రంప్ తన పోస్టులో ఘాటుగా పేర్కొన్నారు. ఈ చర్చల కోసం అమెరికా తరఫున ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ వెళ్లాల్సి ఉంది. తాజా పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

## గణపతి దండకారణ్యంలో లేడు

మావోయిస్టు అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి దండకారణ్యంలో లేరనీ, పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నట్లు తమకు సమాచారం ఉందని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు భార్య జోడె లక్ష్మీబాయి, మరో సెంట్రల్ కమిటీ సభ్యుడు నరహరి, మరో ఇద్దరు రాష్ట్రానికి చెందిన నాయకులు సేతు, శేఖర్లను కూడా లొంగుబాటులో నడపడానికి పూర్తి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. శనివారం 47 మంది మావోయిస్టులు, 32 ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట ఆయన కార్యాలయంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శివధర్రెడ్డి మాట్లాడుతూ.. ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడంతో ఈ సంఖ్య ఇదే చివరిది కావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ లొంగిపోయినవారంతా ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందినవా రేననీ, వీరిలో ఒకరు రాష్ట్ర కమిటీ సభ్యులు, నలుగురు డివిజన్ కమిటీ సభ్యులు, 22 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, మిగతావారంతా క్యాడర్ అని అన్నారు. వీరు స్వాధీనపర్చిన ఆయుధాలలో ఒక ఎల్ఎంజీ, నాలుగు ఏకే 47లు, మూడు ఇన్సాస్లతో సహా రైఫిళ్లు, పిస్టళ్లు, రివాల్వర్, ఎయిర్గన్లతో సహా 32 ఆయుధాలు ఉన్నాయని చెప్పారు. అలాగే 200 కిలోల మందుపాతరలను పేల్చేందుకు ఉపయోగించే ల్యాండ్మైన్ వైర్ను కూడా స్వాధీనం చేసుకున్నామని డీజీపీ తెలిపారు.

**వీరిపై రూ.1.50 కోట్ల నగదు రివార్డు**

వీరందరిపై రూ.1.50 కోట్ల నగదు రివార్డు ఉందనీ, ఈ డబ్బులను వీరి అకౌంట్లు తెరిచాక వారి ఖాతాల్లో వేస్తామన్నారు. ప్రాథమికంగా ఒక్కొక్కరికి రూ.25 వేల చెక్లను అందజేస్తున్నామన్నారు. స్వాధీనపర్చిన ఆయుధాలపై కూడా కేంద్రం నిబంధనల మేరకు వెపన్ను బట్టి అదనంగా డబ్బులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## శ్రీహరికోటకు విక్రమ్-1 రాకెట్..
## జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: అంతరిక్ష పరిశోధన రంగంలో సరికొత్త చరిత్రకు తెలంగాణ రాజధాని వేదికైంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్ 1' ప్రయాణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఘనంగా ప్రారంభించారు. హైదరాబాద్లోని మ్యాక్స్ క్యూ క్యాంపస్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రాకెట్ వాహనానికి జెండా ఊపి శ్రీహరికోటకు సాగనంపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరగడం హర్షణీయమని, హైదరాబాద్ ఈ ప్రస్థానానికి కేంద్ర బిందువుగా మారడం గర్వకారణమని కొనియాడారు. ఈ రాకెట్ నేరుగా నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (SHAR) కు చేరుకోనుంది. అక్కడ తుది విడత ప్రీఫ్లైట్ పరీక్షలు నిర్వహించిన అనంతరం నిర్ణీత ముహూర్తానికి ప్రయోగాన్ని చేపట్టనున్నారు. మరోవైపు, రాష్ట్ర అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు వేగవంతం చేశారు. దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలను (MoUs) వెంటనే కార్యరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాతబస్తీ మెట్రో పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కాగా, ఇటీవలే ఏప్రిల్ 20న కాటారంలో రైతు




భరోసా రెండో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అంతరిక్ష రంగం నుంచి మౌలిక సదుపాయాల కల్పన వరకు తెలంగాణ ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## డిజిటల్ చెల్లింపులు.. కొత్త నిబంధనలు!


దేశంలో డిజిటల్ చెల్లింపులను మరింత సురక్షితంగా, పారదర్శకంగా మార్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక చర్యలు చేపట్టింది. ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్స్ట్రుమెంట్స్ (పీపీఐ) అయిన డిజిటల్ వ్యాలెట్లు, ప్రీపెయిడ్ కార్డులకు సంబంధించి కొత్త ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. వినియోగదారుల రక్షణ, నిర్వహణలో స్పష్టత పెంచడమే ఈ ప్రతిపాదనల ముఖ్య ఉద్దేశం. ఈ ముసాయిదా ప్రకారం, నాన్బ్యాంక్ సంస్థలు పీపీఐ సేవలు అందించాలంటే కనీసం రూ. 5 కోట్ల నికర విలువ కలిగి ఉండాలి. కార్యకలాపాలు ప్రారంభించిన మూడేళ్లలోగా ఈ విలువను రూ. 15 కోట్లకు పెంచుకోవాలి. అలాగే, వినియోగదారుల నుంచి సేకరించిన నిధులను వాణిజ్య బ్యాంకులోని ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో జమ చేయడాన్ని తప్పనిసరి చేశారు. డెబిట్ కార్డులు జారీ చేసే బ్యాంకులు కూడా ఆర్బీఐకి సమాచారం ఇచ్చి పీపీఐ సేవలు అందించవచ్చని ప్రతిపాదించారు. లావాదేవీల పరిమితులపై కూడా డ్రాఫ్ట్లో స్పష్టత ఇచ్చారు. సాధారణ పీపీఐలలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు. నెలకు రూ. 10,000 వరకు నగదు లోడ్ చేసుకోవడానికి అనుమతిస్తారు. చిన్న మొత్తాల పీపీఐల గరిష్ఠ పరిమితిని రూ. 10,000గా, ట్రాన్సిట్ కార్డుల పరిమితిని రూ. 3,000గా నిర్ణయించారు. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా, అన్ని ఛార్జీలు, నిబంధనలు, వ్యాలిడిటీ వివరాలను ఇంగ్లీష్, హిందీతో పాటు స్థానిక భాషలో స్పష్టంగా తెలియజేయాలని ఆర్బీఐ ఆదేశించింది. విఫలమైన, రద్దయిన లావాదేవీలకు సంబంధించిన డబ్బును తక్షణమే వినియోగదారుడి వ్యాలెట్కు రిఫండ్ చేయాలని పేర్కొంది. ఈ ముసాయిదాపై మే 22లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభిప్రాయాలను తెలపాలని ఆర్బీఐ కోరింది.

## కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన' ఆవిర్భావం

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో తన పార్టీని ప్రకటించి, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. మేడ్చల్మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్లోని అద్వయ కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన సభలో ఆమె పార్టీ పేరును, జెండాను ఆవిష్కరించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో కూడిన జెండా మధ్యలో తెలంగాణ మ్యాప్, దానిపై టీఆర్ఎస్ అనే అక్షరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కవిత మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ, దాని నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను పూర్తిగా కోల్పోవడం వల్లే తాను కొత్త పార్టీ పెట్టాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ అభివృద్ధి రథం గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన కొన్ని తప్పుల్లో భాగస్వామినేనని అంగీకరిస్తూ, ఇప్పుడు ఆ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. "ప్రస్తుతం ఉన్న కేసీఆర్ ఒకప్పటి కేసీఆర్ కాదు. ఆయన 'మర మనిషి'గా మారిపోయారు, మన మనిషి కాదు. ఆయన గుంట నక్కల చేతిలో ఖైదీగా మారారు" అంటూ కవిత తన తండ్రిపై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ పట్టించుకోవడం లేదని, అధికారం ముందు మమకారం తగ్గిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను హెచ్చరించినా, తనను పక్కనపెట్టి 'పందికొక్కులను' అందలం ఎక్కించారని మండిపడ్డారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి మంచి పని చేశారని, ఇప్పుడు తన రాష్ట్రం కోసం స్వేచ్ఛగా పోరాడతానని అన్నారు. సామాజిక తెలంగాణ సాధనే తమ పార్టీ లక్ష్యమని కవిత ప్రకటించారు. రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మందికి 'అమ్మ'గా మారి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, రెండేళ్లలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతానని స్పష్టం చేశారు. పార్టీ ప్రకటనకు ముందు కవిత తన బంజారాహిల్స్ నివాసంలో సర్వమత ప్రార్థనలు చేసి, గన్ పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

# మేయర్ కు 32 వ డివిజన్ ప్రజల ఘన సన్మానం

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: పట్టణంలోని 32వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా అత్యధిక మెజార్టీతో గెలిచిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా ఎన్నిక కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డిని 32 వ డివిజన్ యెలిశాల కాలనీ వాసులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి, ఆంజనేయ స్వామి విగ్రహ జ్ఞాపికను బహుకరించారు ఈ సందర్భంగా తమ డివిజన్ నుండి కార్పొరేటర్ గా ఎన్నికై నగర తొలి మేయర్ గా బాధ్యతలు స్వీకరించడం అందరికీ ఎంతోగర్వకారణంగా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. దిన దినాభివృద్ధి చెందుతున్న నల్లగొండ నగరం బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



నాయకత్వంలో మరింత అభివృద్ధి పదంలో ముందుకు సాగుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్ గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తమ కాలనీ తరఫున నిరంతరం బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డికి అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలుస్తామని చెప్పారు. తమ కాలనీలో ఎలాంటి సమస్యలు లేకుండా గత నాలుగు పర్యాయాలుగా విజయం సాధించడంతోపాటు తమ అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న బుర్రి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండకింది సత్తిరెడ్డి, కోటగిరి దైవాదినం, బచ్చు మురళి, కాపర్తి లక్ష్మీ నరసయ్య, తల్లం వెంకటేశం శివకోటి నెహ్రూ, రంగా విద్యాసాగర్, లింగాల సోమయ్య, వెంకన్న, మోదుగు పాండు, కోటగిరి రామకృష్ణ శ్రీధర్, చెర్రీ, వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల సంక్షేమం కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు వెలుగులు నింపాలనే సంకల్పంతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సూర్యాపేట శాసన సభ్యులు జగదీశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 701మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్కూటీల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా లో దివ్యాంగులకు రెట్రో ఫిట్మెంట్ స్కూటీలు, అంగన్వాడీ టీచర్లకు ఫైవ్ జి స్మార్ట్ ఫోన్లను అందజేశారు. శనివారం సూర్యాపేట నియోజకవర్గం లబ్ధిదారుల కు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వీటిని అందజేశారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మెరిశెట్టి నివేదిత తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు మహిళలు ఆత్మవిశ్వాసంతో తమ స్వశక్తితో ఇంకా అభివృద్ధి చెందాలని, అంగన్వాడి మహిళలకు అందించిన 5జి స్మార్ట్ ఫోన్లతో నైపుణ్యాన్ని పెంచుకొని వాటి ద్వారా చిన్న పిల్లలకు ఆటలు, పాటలు, రైమ్స్ నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేణారెడ్డి , వైస్ చైర్ పర్సన్ షఫీ వుల్లా, ఆర్డీఓ వేణుమాధవ్ , ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , సంక్షేమ అధికారి కె. నరసింహరావు, దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, అధికారులు, సిడిపివో, అంగన్వాడీ సూపర్ వైజర్స్, జిల్లా ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జనగణన 2027 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

*** యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : జనగణన 2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం జిల్లాలోని వలిగొండ మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. తమ జాబితాలోని ఇండ్ల గణన కొరకు ముందుగా ఆయా ఇండ్ల యజమానులకు సమాచారం అందించినట్లయితే సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ నాయక్ ఎంఈఓ భాస్కర్ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో విషాదం రైతు ఆత్మహత్య



నర్సాపూర్, ప్రజాస్ఫూర్తి: అప్పుల బాధ తాళలేక రైతు చెట్టు కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కౌడిపల్లి మండల పరిధిలోని బట్టేమ్మ గుడి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి... కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన శాగ్గరి నరేందర్ గౌడ్ (52) తనకున్న రెండు ఎకరాలతో పాటు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొన్నాడు. వరి సాగు చేసుకునేందుకు కెనరా బ్యాంకులో 5 లక్షల రూపాయలు రుణము తీసుకొన్నాడు . పొలాన్ని సాగు చేస్తున్న తరుణంలో సాగునీరు అందక నాలుగు ఎకరాల పంట ఎండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో కూరకపోయాడు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురైన నరేందర్ గౌడ్ బట్టెమ్మ గుడి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్సై అమరేందర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేదలకు కాంగ్రెస్ అండ..

## ఇందిరమ్మ ఇళ్ల పథకంపై మంత్రి సమీక్ష



మెదక్ జిల్లా నర్సాపూర్ , ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 6 గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటని.. మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ లబ్ధిదారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఇందిరా గాంధీ ఆ రోజుల్లో పేద ప్రజలకు గరీబి హటావో అనే నినాదంతో అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని చెప్పి లబ్ధిదారులకు లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. గత బిఆర్ఎస్ పార్టీ నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి 10 సంవత్సరాలు మోసం చేసింది అన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒక గ్యారెంటీ ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగా ఈరోజు నర్సాపూర్ లో నియోజకవర్గంలో 3500 ఇండ్లు కట్టుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ సందర్భంగా 192 ఇండ్ల నిర్మాణం జరుగుతోంది అన్నారు.. 100 ఇందిరమ్మ ఇండ్లు రెడీ ఉన్నాయి. త్వరలో అన్నీ కూడా ప్రారంభిస్తామన్నారు.. మొదటి దఫాలో ఇందిరమ్మ ఇల్లు రానివారికి వచ్చే సంవత్సరంలో ఇంకొక 2,500 ఇల్లు మంజూరు చేస్తామన్నరు. అర్హులైన పేదలందరికీ ఈ ఇండ్లు వచ్చేలా చూస్తామన్నారు..అందరూ ఓపిక పట్టలన్నారు.. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే స్తోమత లేనటువంటి అర్హులకు కాంగ్రెస్ కార్యకర్తలు సహాయం చేసి ఇందిరమ్మ ఇల్లు కట్టించే బాధ్యత తీసుకోవాలని సూచించారు..ఐదు సంవత్సరాల వ్యవధిలో రాష్ట్రంలో 17 లక్షల ఇండ్లు నిర్మించాలని రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు దానికి అందరూ సహకరించాలని కోరారు.. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నర్సాపూర్ నియోజకవర్గంలో 100 శాతం అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.600 స్క్వేర్ ఫీట్స్ కన్నా తక్కువ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలన్నారు.. దింతో దానికి సంబంధించిన బిల్లు కూడా వెంటనే జనరేట్ అవుతుందన్నారు.. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల సరిగ్గా రాని విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు రోజుల్లో కలెక్టర్ తో రివ్యూ మీటింగ్ పెట్టడం జరుగుతుందని. దానికి సంబంధించిన పూర్తి వివరాలు దగ్గర పెట్టుకొని పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజ యాదవ్ , గ్రంధాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజి రెడ్డి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

## నిరుపేద విద్యార్థినిలకు సైకిళ్ళ పంపిణీ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థినిలకు మహబూబాబాద్ రోటరీ క్లబ్ చేయూతనందించింది. పాఠశాల దూరభారాన్ని తగ్గించేందుకు 50 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో స్థానిక ఇందిరా పాఠశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. డిస్ట్రిక్ట్ 3150 రోటరీక్లబ్ గవర్నర్ సోమవరపు వెంకటరాంప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిధులుగా నల్ల వెంకటహన్మంత రెడ్డి, వి.బాలకోటి రెడ్డి,పంగులూరి కళ్యాణ్, అసిస్టెంట్ గవర్నర్ సందసాని నరేష్, డిసిసి అధ్యక్షులు ఉమామురళీ నాయక్, బైద్యనాథ్, మహబూబాబాద్ రోటరీక్లబ్ అధ్యక్షుడు మాలె నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ లీడర్లు వద్దుల సురేందర్ రెడ్డి, సెక్రటరీ జంగాల విజయ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థినుల సహాయార్థం యాభై సైకిళ్ళు పంపిణీ చెయ్యడం సమాజంపట్ల రోటరీక్లబ్ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అన్నాడు. సేవకు మారుపేరుగా నిలుస్తున్న రోటరీక్లబ్ స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. ప్రభుత్వ స్కూళ్ళలో మౌలిక వసతుల కల్పన,విద్యార్థులకు లాప్టాప్ లు, టీవీలు, కంప్యూటర్లు, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు,నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, వృద్ధులకు వినికిడి యంత్రాలు, పోలియోమీద యుద్ధం,రెండువేల మంది విద్యార్థినిలకు రీయుసబుల్ ప్యాడ్లు లాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన ఘనత మహబూబాబాద్ రోటరీక్లబ్ ది అని అన్నారు. గత పద్దెనిమిదేళ్లుగా సుమారు పదికోట్ల రూపాయల విలువచేసే సేవా కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణలోనే ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఘనత మహబూబాబాద్ రోటరీక్లబ్ ది అని అన్నారు. మున్ముందు సేవలు మరింత విస్తృతంగా చేయాలని కోరారు. అనంతరం అతిధులకు బొకే శాలువతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ తోర్నాల నగేష్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజు, సీనియర్ రొటేరియన్లు బోనగిరి గిరిధర్ గుప్తా, బొల్లం శ్రీనివాస్, జంగాల నర్సింహారావు, కల్లెం వెంకట్ రెడ్డి, లక్ష్మీ నర్సింహారావు, ముల్లంగి మోహన్ రెడ్డి, దూదికట్ల సత్యం, ఓదెల శివకుమార్, వల్లాల రమేష్, వనమాల సురేష్,అచ్చ శ్రీనివాస్, విధ్యర్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో మొక్కలకు నీరుపోసి సంరక్షించుకోవాలి

*** మాజీ ఎంఈఓ డాక్టర్. ప్రభు దయాల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భగభగ మండుతున్న ఎండల్లో ప్రజలు బయటికి రావడానికే జంకుతున్న వేళ... రోడ్డు డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలు ఎండిపోతూ ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన మాజీ కొత్తగూడెం ఎంఈఓ డా. దయాల్ ముందుకొచ్చి మొక్కలకు నీరు పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో హరితహారం పథకంలో భాగంగా గతంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను స్వయంగా తీసుకున్న ఆయన, రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లకు పాదులు చేసి, వేసవి తీవ్రత మధ్య రోజూ నీరు పోస్తున్నారు. దీంతో ఎండిపోతున్న మొక్కలకు మళ్లీ జీవం వస్తోంది.ఒకప్పుడు పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి చేర్చిన డా. దయాల్... ఇప్పుడు ప్రకృతి సేవలో నిమగ్నమై ఆదర్శంగా నిలుస్తున్నారు.ప్రకృతిని కాపాడితేనే మనుగడ:"మనం ప్రకృతిని కాపాడితే... ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో ఉన్న మొక్కలు, చెట్లను కాపాడాలని డా. ప్రభుదేయాల్ పిలుపునిచ్చారు.వేసవి కాలంలో మొక్కలకు నీరు పోయడం ద్వారా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు.



## మంత్రి వివేక్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మధ్య మాటల యుద్ధం



మెదక్ జిల్లా నర్సాపూర్ , ప్రజాస్ఫూర్తి : నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్.. కార్యక్రమంగా మారిపోయింది. కార్యక్రమం మొత్తం ఒక్కసారిగా ఉధృతంగా మారింది. అక్కడున్న నాయకులను కార్యకర్తలను సముదాయించడానికి ప్రయత్నించగా మరింత నినాదాలు గట్టిగా చేయడం ఎక్కువైంది. మంత్రి మాట్లాడేటప్పుడు జై టిఆర్ఎస్ అని నినాదాలు చేసిన టిఆర్ఎస్ శ్రేణులు. మంత్రి వివేక్ వెంకటస్వామి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం కాలేశ్వరంపై లోటుపాట్లు దానిపై మాట్లాడగా టిఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా జై టిఆర్ఎస్ జై కేసీఆర్ అంటూ నినాదాలు ఇచ్చారు. కెసిఆర్ కాలేశ్వరం ప్రాజెక్టు చేపట్టి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు అని మంత్రి అనగా ఒక్కసారిగా జై కేసీఆర్ జై బి ఆర్ ఎస్ అని బి ఆర్ఎస్ నేతలు గట్టిగా నినాదాలు ఇచ్చారు. కాలేశ్వరం పై క్లీన్ చీటీ వచ్చిందని దానిపై మాట్లాడొద్దని మంత్రిని సునీత రెడ్డి కోరగా మంత్రి మాట్లాడడంతో ఈ పరిణామం చోటు చేసుకుంది. సునీత రెడ్డి ని మంత్రి వివేక్ మరియు జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ సముదాయించే ప్రయత్నం చేయగా సునీత రెడ్డి వినకపోవడం తో మరింత ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది...

## ఎనిమిది రోజుల తర్వాత గోదావరిలో శవమై తేలిన మల్లేష్



ప్రజాస్ఫూర్తి, జన్నారం : గత ఎనిమిది రోజుల క్రితం గోదావరి లో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జన్నారం మండలం తిమ్మాపూర్ గోదావరి పరిసరాల్లో అదృశ్యమైన గూడ మల్లేష్ మృతదేహం శనివారం దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ప్రాంతంలో గుర్తించారు. దండేపల్లి మండలం నాగసముద్రానికి చెందిన గూడ మల్లేష్ ఈ నెల 16న రాత్రి తిమ్మాపూర్‌లో పేకాడుతుండగా పోలీసులు అనుకొని పారిపోయి అదృశ్యమయ్యాడు.అప్పటి నుంచి పోలీసులు, కుటుంబసభ్యులు డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. శనివారం గుడిరేవు వద్ద గోదావరిలో శవమై తేలడంతో కుటుంబసభ్యులు మల్లేష్‌గా గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.మల్లేష్ మరణంపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అనుముకున్నాయి.

## హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

*** దండి లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ హుస్నాబాద్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రతి పేదవాడి కళ్ళలో ఆనందం చూడాలనే లక్ష్యంతోటే పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి అన్నారు.హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని,స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, అదేవిధంగా అర్హులైన ప్రతి పేద లబ్ధిదారుడికి దఫాల వారీగా అందరికీ వచ్చే విధంగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు.నూతన గృహప్రవేశాలతో పేదవాళ్ల కళ్ళలో ఆనందం చూస్తున్నామని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్,వైస్ చైర్మన్ చిత్తారి పద్మ 15వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల రజిత కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ని రాష్ట్ర పండుగగా నిర్వహించడం హర్షణీయం




సూర్యాపేట, ప్రజాస్ఫూర్తి: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ జిల్లా చైర్మన్ మాజీ మున్సిపల్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదితా లక్ష్మీ, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తరతరాలుగా ఆర్యవైశ్యులు తమ కుల దేవత గా పూజలు చేస్తున్న వాసవి మాత జయంతిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గౌరవం కల్పించడం పట్ల వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,మంత్రి మండలి కి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తాకి ధన్యవాదాలు తెలియజేశారు. సూర్యాపేట జిల్లాలోని ప్రతి మండలంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈనెల 26వ తేదీన సూర్యాపేట జిల్లాలో అధికారికంగా నిర్వహించే వాసవి మాత జయంతి కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు కలకోట లక్ష్మయ్య, రాచకొండ శ్రీనివాస్, సింగిరికొండ రవీందర్, మంచాల రంగయ్య, బెలిదె శ్రీనివాసులు, కుక్కడపు శ్రీనవాస్, చల్లా లక్ష్మయ్య, బిక్కుమళ్ల కృష్ణ, మిట్టపల్లి రమేష్, గుండా రమేష్, కక్కిరేణి మోహన్ , బచ్చు పురుషోత్తం, కొండ్లె కృష్ణయ్య, సోమ ప్రవీణ్ , కర్నాటి వంశి , శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడిపై సత్వరమే స్పందించాలి

**: ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు సత్వరమే స్పందించి పరిష్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. శనివారం స్థానిక సింగరేణి అతిథిగృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా బోర్ల మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం కలిగించే పైప్‌లైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన అరికట్టాలని, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. కొనసాగుతున్న నీటి పథకాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి చివరి ఇంటికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని, నీటి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సరోగసీ కేసుల్లో నిరాటంక దర్యాప్తు అవసరం

* **ఈడీ అరెస్టును చట్టవిరుద్ధంగా ప్రకటించలేమన్న హైకోర్టు**
* **డాక్టర్ పచ్చిపాల నమ్రత పిటిషన్ కొట్టివేత**



హైదరాబాద్: ''పిల్లలు లేని దంపతులు ఎన్నో ఆశలతో సంతానోత్పత్తి కేంద్రాలను ఆశ్రయిస్తారు. ఈ ప్రక్రియ చట్టబద్ధమైనదని, నైతికమైనదని వైద్యపరంగా విశ్వసించి శారీరక, ఆర్థిక వనరులను పెట్టుబడులుగా పెడతారు. తమ కన్నబిడ్డను ఇంటికి తీసుకెళుతున్నామనే నమ్మకంతో ఉన్న తల్లిదండ్రులు బిడ్డ తమది కాదని తెలిస్తే జీవితాంతం నిస్సహాయతతో కుమిలిపోవాల్సి రావచ్చు. పుట్టుకకు సంబంధించిన అంశాన్ని మార్చినపుడు బిడ్డ తీవ్రమైన వేదనకు గురికావచ్చు. అందువల్ల వృత్తిపరమైన చిత్తశుద్ధి, పారదర్శక కౌన్సెలింగ్‌తో రికార్డులను నిర్వహించాలి. శిశువుల మార్పిడి, రికార్డుల తారుమారు, జనన నమోదు మార్పిడి వంటివి సంస్థాగత విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. చట్టబద్ధమైన సరోగసీని అనుమానంగా చూసే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి కేసుల్లో దర్యాప్తునకు ఆటంకం కలిగించలేం'' అని హైకోర్టు స్పష్టంచేసింది. సరోగసీ ఆరోపణలకు సంబంధించి నమోదైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన అరెస్టును రద్దు చేసి..తనను విడుదల చేసేలా ఆదేశించాలన్న డాక్టర్ పచ్చిపాల నమ్రతకు హైకోర్టులో చుక్కెదురైంది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఈడీ ప్రత్యేక కోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేసుకోవడానికి పిటిషనర్‌కు అవకాశం ఉందని పేర్కొంది. దర్యాప్తు సంస్థ ఎలాంటి సాక్ష్యాధారాలు సేకరించలేదన్న పిటిషనర్ వాదనను అనుమతించలేమంది. నేరం ద్వారా వచ్చిన సొమ్ము మళ్లింపు, ఇతర ప్రాథమిక ఆధారాలను ఈడీ ప్రత్యేక న్యాయవాది డొమినిక్ ఫెర్నాండెజ్ కోర్టు ముందుంచారంది. పిల్లలను ఒక వస్తువుగా మార్చడాన్ని, జనన రికార్డుల సమగ్రతను, కుటుంబ గుర్తింపును దెబ్బతీయడానికి వైద్య వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారని ఆరోపణలు ఎదురైనపుడు దాని మూల్యాన్ని సమాజమే చెల్లించాల్సి వస్తుందని, అందువల్ల అలాంటి ఆరోపణలపై చట్టబద్ధంగా జరిపే దర్యాప్తులకు ఆటంకం కలిగించకుండా న్యాయవ్యవస్థ వ్యవహరించాలని స్పష్టం చేసింది. అందువల్ల అరెస్టును రద్దు చేయాలన్న విజ్ఞప్తిని అనుమతించలేమని పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# ఆస్పిరేషనల్ జిల్లా – బ్లాక్‌ల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష

* **కీలక సూచనలు చేసిన సెంట్రల్ ప్రభారి ఆఫీసర్ డాక్టర్ సాయిబాబు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఆస్పిరేషనల్ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా డేటా ఆధారితంగా ఉండాలని, ప్రతి సూచికలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని మినిస్టరీ ఆఫ్ పవర్ అడిషనల్ సెక్రెటరీ డాక్టర్ సాయిబాబు సూచించారు. సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా నోడల్ అధికారి లోకేష్, సిపిఓ సంజీవరావు ఆస్పిరేషనల్ జిల్లాలు, బ్లాక్‌లలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా, సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని వివిధ శాఖలు చేపడుతున్న కార్యక్రమాల అమలు విధానం, పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జిల్లాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని డాక్టర్ సాయిబాబు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన జిల్లాకు రూ.10 కోట్లు, రెండవ స్థానానికి రూ.5 కోట్లు, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన జిల్లాలకు రూ.3 కోట్లు చొప్పున మొత్తం రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులు అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మండలాలకు రూ.20 కోట్ల ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పరిశీలించారు. డిజిటల్ కనెక్టివిటీ పెంపు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవల అందుబాటును మరింత మెరుగుపరచవచ్చని, విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచడం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు ప్రపోజల్స్ సిద్ధం చేసే విధానం, అమలు సమయంలో ఎదురయ్యే సాంకేతిక అంశాలపై ఉన్న సందేహాలను ప్రభారి అధికారి సమగ్రంగా నివత్తి చేశారు. శాఖల మధ్య సమన్వయం పెంచి లక్ష్యాల సాధనలో వేగం తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ కార్యక్రమాల అమలులో జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి సూచికలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ స్థాయిలో సేవల చేరికను పెంచుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, ఆస్పిరేషన్ బ్లాక్ ఫెలో నవనీత్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వాయిద్య కళాకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా చెరువు సమీపంలో బ్యాండ్ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీశైలం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూ బ్యాండ్ కళాకారుల సంక్షేమం కోసం పలు డిమాండ్లు వెల్లడించారు. 50 సంవత్సరాలు పైబడిన కళాకారులకు పింఛన్ కల్పించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా సౌకర్యాలు అందించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్యాండ్ కళాకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇటీవల సౌండ్ పొల్యూషన్ పేరుతో రాత్రి 10 గంటల లోపు బ్యాండ్ వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేయడం వల్ల కళాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనికి కారణమైన జి.ఓ. 227ను రద్దు చేయాలని, బ్యాండ్ వాహనాలను సీజ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా శ్రీశైలం, జిల్లా అధ్యక్షులుగా రాచర్ల శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతల శేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగేష్, టింకు, మహముదిన్, అనిల్ కుమార్, బస్వరాజ, కాశిప్ప, చంద్రమౌళి, సహాయ కార్యదర్శులుగా డెవిడ్, హనుమంత్, చరణ్, సంవత్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సంతోష్, హరీష్, గణేష్, మంజునాథ్, గోపాల్, వీరుని ఎన్నికయ్యారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం


**– కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్, గేమ్స్ కోచింగ్ క్యాంపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన క్రీడాస్ఫూర్తి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని చెప్పారు. క్రీడలు కేవలం శారీరక ధృడత్వాన్నే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి విద్యార్థులలో అపారమైన ఉల్లాసాన్ని, ఏకాగ్రతను ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. వేసవి సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణాశిబిరం ఒక సువర్ణ అవకాశమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్, స్విమింగ్, యోగా, అథ్లెటిక్, నెట్ బాల్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ వంటి పది రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7వ తేదీ వరకు నెల రోజుల పాటు సాగనున్న ఈ క్రీడా సంబరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు, పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా కార్యాలయం అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ మహేందర్, బాక్సింగ్ మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంటేశ్వర్లు, మల్లికార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ ఎత్తేసే యోచనలో ప్రభుత్వం

* **పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం.**
* **ప్రభుత్వంపై విద్యార్థుల తిరుగుబాటు తప్పదు ఏబీవీపీ నాయకులు డిమాండ్.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదలకై పాంప్లెంట్ విడుదల చేసి ఉద్యమ కార్యాచరణను ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాస్టల్ కో కన్వీనర్ చింతల పవన్ కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నది అని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై ప్రైవేట్ విద్యాసంస్థలు, హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ప్రభుత్వాన్ని ఈ పథకం అమలుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పదే పదే అడిగినప్పటికీ కౌంటర్ దాఖలు చేయని కారణంగా "ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా ఇలాంటి నిర్ణయానికి కారణం అయింది అని అన్నారు లక్షలాది మంది పేద విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మా, లా, మెడిసిన్ లాంటి కోర్సులు చదివి దేశ విదేశాల్లో స్థిరపడి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారంటే దానికి కారణం "ఫీజు రీయింబర్స్మెంట్ పథకం" అని, ప్రతీ యేట 14 లక్షల మంది విద్యార్థులు ఈ ఫీజు రీయింబర్స్మెంట్ పథకం పై ఆధార పడి చదువుకుంటున్నారు అని ఆయా కోర్సులలో ప్రభుత్వ హామీ మేరకే ఫీజు రీయింబర్స్మెంట్ వస్తుందని అడ్మిషన్లు పొందారు కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వ తీరుతో విద్యార్థిలోకం అయోమయ స్థితిలో పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలోసిద్దిపేట జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్ హుస్నాబాద్ నగర సంయుక్త కార్యదర్శి అంజి, విరాట్ శశి కుమార్, మణికంఠ పూర్ణ చందర్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు హృదయమే లేకుంటే తెలంగాణ వచ్చేదా!

* **కవిత వ్యాఖ్యలపై భారాస ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి**



జగిత్యాల: కేసీఆర్ మరమనిషి కాదని, మనసున్న మనిషి అని మాజీ మంత్రి, భారాస ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రజాస్వామ్యంలో అందరికీ హక్కుందని, కానీ ఆత్మీయతను మరిచి కన్న తండ్రినే విమర్శించడానికి నోరెలా వచ్చిందని కవితనుద్దేశించి ప్రశ్నించారు. కేసీఆర్‌కు హృదయం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించేదా? అని ప్రశ్నించారు. విభేదాలు ఉండొచ్చు కానీ, వాస్తవాలు విస్మరించరాదని.. పదవులు అనుభవించి తప్పు పట్టడం సరికాదన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టే లక్ష్యం ఉండాలని, కానీ కన్నతండ్రినే విమర్శించడం చూస్తే రేవంత్‌రెడ్డి బీ టీమ్‌ను రంగంలోకి దింపినట్లు భావించాల్సి వస్తుందన్నారు.


## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



వలిగొండ , ప్రజాస్ఫూర్తి : రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ . పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ పరిధిలో ఎన్ని సెంటర్ లు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మార్కెట్ యార్డ్ కి ఎంత మొత్తం ధాన్యం వచ్చిందని, కొనుగోళ్లు ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుందనీ.ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేసారనీ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత ధాన్యం ఉందని తెలుసుకున్నారు.రోజు వారీగా సరిపడా లారీలు వస్తున్నాయా అని ఆరా తీశారు.ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలనీ. ఎక్కువ మంది హమాలీలను తీసుకొచ్చి తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలి అన్నారు. రైతులు ఎవరు తక్కువ ధరకు అమ్మి నష్ట నష్ట పోవద్దన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం అనుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దశరథ నాయక్ మార్కెట్ చైర్మన్ భీమా నాయక్ సింగిల్ విండో సీఈవో బోనగిరి ముత్యాలుఅధికారులు రైతులు పాల్గొన్నారు.

## గాంధీ నగర్ వ్యవస్థాపకులు జల్ల రాఘవులుకు ఘన నివాళి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి నగర డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనాథ్ తండ్రి గాంధీనగర్ కాలనీ వ్యవస్థాపకులు జల్లా రాఘవులు శనివారం ఉదయం స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గాంధీనగర్ లోని వారి నివాసానికి చేరుకొని జల్ల రాఘవులు పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం జల్ల రాఘవులు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు జల్ల రాఘవులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య,కె.జయరాం, అబ్దుల్ ఖాదర్, స్థానిక నాయకులు తదితరులున్నారు.

## భారాస దోపిడీలో కవితకూ సమాన భాగస్వామ్యం

* **పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపణ**



హైదరాబాద్: పదేళ్ల భారాస దోపిడీలో కవితకు కూడా సమాన భాగస్వామ్యం ఉందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో కొత్త పార్టీలను స్వాగతిస్తున్నామని, రాజకీయ పార్టీ పెట్టినందుకు కవితకు అభినందనలు అని అన్నారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో మాట్లాడారు. 'భారాస నేతలు రాష్ట్రాన్ని దోచుకుంటుంటే కవిత మౌనంగా ఉండి ఆ అక్రమాల్లో పాలు పంచుకున్నారు. ఇప్పుడు భారాసపై విమర్శలు చేస్తూ తప్పించుకోవాలని చూస్తున్నారు. కేసీఆర్ చుట్టూ గుంట నక్కలు ఉన్నాయని కవిత అంటున్నారు. పదేళ్ల పాటు ఆ పార్టీలో కొనసాగినప్పుడు ఆ గుంట నక్కలు ఏవో ఆమెకు తెలియదా? అధికారం పోయాక ఇప్పుడు ఆమె కొత్త మాటలు మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో ఆశ ఉండాలి కానీ అత్యాశ పనికిరాదు. సీఎం రేవంత్‌రెడ్డిపై కవిత ఆరోపణలు అర్థరహితం. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా కాంగ్రెస్‌కు తిరుగులేదు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం' అని మహేశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# జమిలి ఎన్నికలతో 26 లక్షలమంది సిబ్బంది.. 1.04 కోట్ల పనిదినాలు ఆదా

ఢిల్లీ: జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తే దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ కోసం వినియోగించే సిబ్బంది సంఖ్య 26 లక్షలు తగ్గుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి అంచనా వేసింది. దీనివల్ల 1.04 కోట్ల వ్యక్తిగత పనిదినాలు ఆదా అవుతాయని పేర్కొంది. జమిలి ఎన్నికలతో పోలింగ్ సిబ్బంది మోహరింపులో వచ్చే తగ్గుదలపై ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ ఓ విశ్లేషణాపత్రం విడుదల చేశారు.

* ప్రస్తుతం అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతున్నాయి. వీటి కోసం గత అయిదేళ్ల కాలంలో 91,54,010 మంది సిబ్బందిని ఉపయోగించారు. అదే ఈ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహిస్తే 65,77,326 మంది సరిపోతారు.
* ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు, లోక్‌సభ ఎన్నికలకు ప్రిసైడింగ్ అధికారితోపాటు



నలుగురు సిబ్బంది కలిపి మొత్తం 9 మందిని ఉపయోగిస్తున్నారు. జమిలి ఎన్నికలకైతే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు కలిపి ఆరుగురు సిబ్బంది సరిపోతారు.

* సాధారణంగా ఒక్కో పోలింగ్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ, రెండు రోజుల ఎన్నికల పని ఉంటుంది. అంటే.. సగటున నాలుగు రోజులు పనిచేయాల్సి వస్తుంది. జమిలి ఎన్నికల నిర్వహణ కారణంగా 26 లక్షలమంది సిబ్బంది అవసరం తగ్గడం వల్ల 1.04 కోట్ల పనిదినాలు ఆదా అవుతాయి. ఎన్నికల సిబ్బందిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటారు. అత్యధిక పోలింగ్ స్టేషన్లు పాఠశాలల్లోనే ఏర్పాటవుతుంటాయి. జమిలి ఎన్నికల కారణంగా పోలింగ్ సిబ్బంది, స్టేషన్ల సంఖ్య తగ్గడంవల్ల పాఠాలు చెప్పడానికి టీచర్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంటారు. దానివల్ల బోధనా దినాలు కలిసి వస్తాయి.

## భాజపాలోకి రాఘవ్ చడ్డా..
# 10లక్షలు తగ్గిన ఫాలోవర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఎంపీ రాఘవ్ చడ్డాకు యువతలో మంచి క్రేజ్ ఉంది. రాజ్యసభలో ఆయన వేసే ప్రశ్నలు, మాట్లాడే పద్ధతిని నెటిజన్లు తరచూ అభినందిస్తుంటారు. అయితే శుక్రవారం ఆయన ఆమ్‌ఆద్మీ పార్టీని వీడి భాజపాలోకి చేరడంపై అభిమానుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. పార్టీ మారుతున్నట్లు చడ్డా ప్రకటించిన 24 గంటల్లోనే సోషల్ మీడియాలో ఆయన ఫాలోయింగ్ తగ్గిపోయింది. ఈ ఎంపీకి ఇన్‌స్టాలో 14.6 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా.. నిన్నటినుంచి నేటి మధ్యాహ్నానికి ఆ సంఖ్య 13.5 మిలియన్లకు తగ్గింది. ఆయన నిర్ణయాన్ని జెన్‌జీ వ్యతిరేకించడమే దీనికి కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు. చడ్డాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ తగ్గిపోవడంపై ఎన్సీపీ (ఎస్పీ) అధికార ప్రతినిధి అనీష్ గవాండే



మాట్లాడుతూ.. ఇంటర్నెట్ మిమ్మల్ని రాత్రికి రాత్రే హీరోగా చేయగలదు.. అలాగే రాత్రికి రాత్రే జీరోకి కూడా పడేయగలదని అన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయం నచ్చని కారణంగానే 10 లక్షల మంది యువత రాఘవ్ చడ్డాను అన్‌ఫాలో చేశారన్నారు.



# బెంగాల్ పోరు..
## భాజపా అభ్యర్థిపై 119 క్రిమినల్ కేసులు

కోల్‌కతా, ఏప్రిల్ 25: పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల రెండో దశలో ముమ్మర ప్రచారం కొనసాగుతోంది. అధికార తృణమూల్‌తో పాటు భాజపా, కాంగ్రెస్ నేతలు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ భాజపా అభ్యర్థి నామినేషన్‌కు సంబంధించి ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. ఉత్తర 24 పరగణాల జిల్లా నొవపాడా నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న అర్జున్ సింగ్‌పై 119 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఆయనపై 24 కేసులు ఉండగా.. ఈసారి వందకుపైగా పేర్కొనడం గమనార్హం. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న అర్జున్ సింగ్.. భాట్‌పారా నుంచి నాలుగు సార్లు గెలుపొందారు. 2019లో భాజపాలో చేరి బ్యారక్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. 2022లో తిరిగి టీఎంసీలో చేరారు. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బ్యారక్‌పూర్ నుంచి టికెట్ ఇవ్వకపోవడంతో మళ్లీ భాజపాలోకి వెళ్లిపోయారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో నొవపాడా నుంచి పోటీకి దిగారు.



## తల్లిని భుజాలపై మోస్తూ.. కేదార్‌నాథ్ యాత్ర

కేదార్‌నాథ్: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న చార్‌ధామ్ యాత్ర (కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి)లో ఓ సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు సోదరులు ధీరజ్, తేజ్‌పాల్ తమ 60 ఏళ్ల తల్లిని డోలీలో భుజాలపై మోసుకుంటూ రుద్రప్రయాగ్‌లోని కేదార్‌నాథ్‌కు తీసుకువెళ్లారు. జీవితంలో ఒక్కసారైనా కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించాలనే తల్లి కోరికను తీర్చడానికి ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. తమ తల్లిని డోలీలో మోస్తూ.. ఉత్తర్‌ప్రదేశ్, హిమాలయాలలోని క్లిష్టమైన మార్గాల్లో దాదాపు 1,800 కిలోమీటర్లు నడుచుకుంటూ ఆలయానికి వచ్చామన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి కేదార్‌నాథ్ చేరుకోవడానికి తమకు మూడు నెలల 24 రోజులు పట్టిందన్నారు. ఉత్తరాఖండ్‌లో ఈ నెల 19న చార్‌ధామ్ యాత్ర మొదలయ్యింది. అక్షయ తృతీయ సందర్భంగా ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరవడంతో యాత్ర ప్రారంభమైంది. దీంతో వందల సంఖ్యలో భక్తులు కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాల్లో దైవదర్శనానికి తరలివస్తున్నారు.

# మమత బెంగాల్‌ను..మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారు: రాహుల్ గాంధీ

హుగ్లీ, పశ్చిమ బెంగాల్: ప్రధాని నరేంద్ర మోదీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ.. దేశ సంపదను ధనికులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తన చర్యలతో మమత బెంగాల్‌ను నాశనం చేస్తే.. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు.



ప్రస్తుతం జరుగుతున్నది ఎన్నికల పోరాటం కాదని.. సిద్ధాంతాల పోరాటమని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఐక్యతసోభ్రాతృత్వం.. మరోవైపు భాజపాఆర్ఎస్ఎస్‌ల ద్వేషపూరిత మధ్య పోరాటం జరుగుతోందన్నారు. హుగ్లీ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భక్తుడినని చెప్పుకొంటూ ప్రధాని మోదీ దేశాన్ని అమ్ముకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో ద్వేషాన్ని, భయాన్ని వ్యాపింపజేస్తారన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అన్ని రాష్ట్రాలు లోబడి ఉండాలని భాజపా ప్రయత్నిస్తోందన్నారు. ఆ పార్టీ పేదల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. ధనికుల లబ్ధి కోసమే పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో సామాన్యుల పురోభివృద్ధి కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి అస్తవ్యస్తం చేస్తోందన్నారు.

# అప్పుడు చిరిగిన దుస్తులు వేసుకునేవారు: కేజ్రీవాల్‌పై స్వాతి మాలీవాల్ ఫైర్

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై ఎంపీ స్వాతి మాలీవాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు నిజాయితీగా ఉన్న ఆయన అధికారంలోకి వచ్చాక అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. 2011లో ఢిల్లీలో తాము అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టిన సమయంలో.. ఆయన చిరిగిన దుస్తులు వేసుకునేవారని.. రెండు రూపాయల పెన్ను వాడుతూ.. పూర్తిగా పాడుబడిన కారులో తిరిగేవారని గుర్తుచేశారు. దేశంలోని వ్యవస్థల్లో మార్పు తెస్తారనే నమ్మకంతో తామంతా కేజ్రీవాల్ వెనుక నడిచామన్నారు. అయితే సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత.. రూ.100



కోట్లతో విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నారని దుయ్యబట్టారు. పార్టీని వీడినందుకు అందరూ తమను ద్రోహులుగా భావిస్తున్నారని..కానీ అసలైన ప్రజా ద్రోహి కేజ్రీవాలేనని ఆమె మండిపడ్డారు. 2006 నుంచి తాను అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి పని చేశానని.. ప్రతి ఉద్యమంలోనూ ఆయనకు మద్దతిచ్చానని తెలిపారు. అయినప్పటికీ కేజ్రీవాల్ నివాసంలోనే ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌తో తనను తీవ్రంగా కొట్టించారన్నారు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత వారి అవినీతి పంజాబ్‌కు పాకిందన్నారు. తాను ఎవరి బలవంతం మీదనో భాజపాలో చేరలేదని.. ప్రధాని మోదీ నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే చేరానని స్పష్టం చేశారు.

**అవన్నీ తప్పుడు ప్రచారాలు: ఆప్**

ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నూతన నివాసం ఫొటోలుగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఫొటోలు నకిలీవని ఆమ్‌ఆద్మీ పేర్కొంది.

# 'అవన్నీ కల్పితాలే'.. వస్త్రధారణ పాలసీపై ఇండిగో


హైదరాబాద్, ఏప్రిల్ 25: ఇండిగో సిబ్బంది వస్త్రధారణ, వ్యక్తిగత అలంకరణ మార్గదర్శకాలకు సంబంధించినవిగా భావిస్తున్న కొన్ని పత్రాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. మంగళసూత్రం, సిందూరం వంటివాటిపై ఇండిగో ఆంక్షలు విధించిందని.. తద్వారా సిబ్బందిపై మతపరమైన వివక్ష చూపిస్తోందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, ఈ ఆరోపణలను ఇండిగో ఖండించింది. అవన్నీ కల్పితాలేనని, తప్పుడు వార్తలను నమ్మొద్దని స్పష్టం చేసింది. "మహిళా సిబ్బంది మంగళసూత్రం,



సిందూరం ధరించొద్దు. మెహందీ పెట్టుకోకూడదు. మతపరమైన దారాలు కట్టుకోకూడదు. అదేవిధంగా పురుష సిబ్బందికి తిలకం అనుమతి లేదు" అంటూ ఇండిగో మార్గదర్శకాల పేరిట కొన్ని పత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై నెటిజన్ల నుంచి విమర్శలు రావడంతో ఇండిగో (IndiGo) వివరణ ఇచ్చింది. వాటిని తప్పుడు పత్రాలుగా కొట్టిపారేసింది. ధ్రువీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలను కోరింది. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది కోసం తాము రూపొందించిన విధానాలు ప్రపంచంలోనే ఉత్తమమైనవని.. సిబ్బంది భద్రత, శ్రేయస్సే వాటి లక్ష్యమని ఇండిగో తెలిపింది. సమ్మిళిత పని వాతావరణాన్ని సృష్టించే విషయానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. ఇటీవల లెన్స్‌కార్ట్ సైతం ఇదే తరహా వివాదంలో చిక్కుకుంది. బిందీ, తిలకం సహా ఎలాంటి అంశాలపైనా తమ సంస్థలో ఆంక్షలు లేవని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూష్ బన్సల్ స్పష్టత ఇచ్చారు.

# అనవసరంగా నన్ను వివాదంలోకి లాగారు: నరవణె

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. దీనిపై నరవణె తాజాగా స్పందించారు. తన పుస్తకం ఇంకా పబ్లిష్ కాకపోయినా, అనవసరంగా తనను ఈ వివాదంలోకి లాగారంటూ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నరవణె రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. నరవణె రచించిన మరో పుస్తకం 'ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ అన్‌ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్' ఇటీవల విడుదలైంది. ఈ క్రమంలోనే ఆయన పీటీఐతో మాట్లాడుతూ.. "ఈ మధ్య జరిగిన నా పుస్తకం వివాదం తర్వాత రెండు పుస్తకాలు రాశాను. వాటిల్లో ఒకటి విడుదలైంది. మరోటి త్వరలో రానుంది. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీని పూర్తిగా పరిశీలించేవరకు ప్రచురణను నిలిపివేయమని రక్షణ మంత్రిత్వశాఖ కోరింది. ఆ విషయం అక్కడితో ముగిసింది. నేను ముందుకెళ్లాను.. నా వరకు అది ముగిసిపోయిన అధ్యాయం. కానీ ప్రచురితం కాని పుస్తకాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కొందరు దానిపై తీవ్ర చర్చలు చేశారు. దీనివల్ల పుస్తకంతో పాటు నన్నూ ఈ వివాదంలోకి లాగినట్లైంది. అది ఏమాత్రం సమంజసం కాదు" అని రాహుల్‌గాంధీని ఉద్దేశించి పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద అంశాలను ప్రస్తావిస్తూ నరవణె రాసిన ఈ పుస్తకానికి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ప్రచురణ




అనుమతి లభించలేదు. అయినప్పటికీ అప్పట్లో దీన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభకు తీసుకువెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పుస్తకాన్ని ప్రధానికి అందిస్తానంటూ రాహుల్ పేర్కొన్నారు.

# కేజ్రీవాల్.. ఢిల్లీ 'రెహమాన్ డెకాయిత్': భాజపా నేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ డిప్యూటీ సీఎం పర్వేశ్ వర్మ విమర్శలు గుప్పించారు. ఇటీవల కేజ్రీవాల్ లోధి ఎస్టేట్‌లో ప్రభుత్వ బంగ్లాలోకి మారిన సందర్భంగా ఆయన రెండో శీష్ మహల్‌ని (అద్దాల మేడ) నిర్మించుకున్నారని పర్వేశ్ ధ్వజమెత్తారు. గతంలో కేజ్రీవాల్ సీఎం పదవిలో ఉన్నప్పుడు కూడా తన అధికారిక నివాసాన్ని ప్రజల సొమ్ముతో లగ్జరీ ఇంటిగా మార్చినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. పర్వేశ్ వర్మ



మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "మాజీ సీఎం కేజ్రీవాల్ ఢిల్లీకి రెహమాన్ డెకాయిత్ లాంటివాడు. గతంలో నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతానని చెప్పిన కేజ్రీవాల్ 'శీష్ మహల్' 2ని నిర్మించుకున్నారు. ఢిల్లీ ఓటర్లు ఆప్ ప్రభుత్వాన్ని నిరాకరించడంతో ఇప్పుడు ఆప్ అధినేత దృష్టి పంజాబ్‌పై పడింది. కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్, మనీశ్ సిసోదియాతో సహా ఆప్ నాయకులు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నివాసం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉంటున్న లోధి ఎస్టేట్ ఫొటోలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ.. ఇదీ కేజ్రీవాల్ నిరాడంబరమైన జీవితం అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "నేను ఇంతకుముందు 'శీష్ మహల్'ని సందర్శించాను. ఇంత విలాసవంతమైన భవనంలో అసలు ఎవరికైనా ఎలా నిద్ర పడుతుందని అప్పుడే అనుకున్నా" అని ఎద్దేవా చేశారు. ఈ అద్దాల మేడ వ్యవహారంపై ఆప్ స్పందిస్తూ.. "పర్వేశ్ వర్మ మీడియా సమావేశంలో ప్రదర్శించిన చిత్రాలు నిజం కాదు.. ఫేక్" అని వెల్లడించింది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లాను అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. ఆ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా (BJP) అభివర్ణించింది.

# వడ్ల కొనుగోలుపై కేటీఆర్ అసంతృప్తి.. రోడ్లపై వచ్చి ఆందోళన చేస్తామని వార్నింగ్..!

సిరిసిల్ల, సిరిసిల్ల నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు కేంద్రాల పరిస్థితిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాలను సందర్శించిన ఆయన, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రైతులు వడ్లు కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనలేదని కేటీఆర్ ఆరోపించారు. మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కొనుగోళ్లు చేపట్టడం లేదని విమర్శించారు. రైస్ మిల్లుల



కేటాయింపు లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. మిల్లులు కేటాయించకపోతే వడ్లు ఎవరు కొనాలి? ఎలా తూకం వేయాలి..? అని ప్రశ్నించారు. ఈ పరిస్థితిని దళారులకు వదిలేసి కమిషన్ల కోసం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతుబంధు పథకం పేరుతో ప్రకటించిన సాయం కూడా అందడం లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక అధికారులను అడిగితే ఇప్పటివరకు 1000 క్వింటాళ్ల వడ్లు కూడా కొనలేదని చెప్పడం పరిస్థితి తీవ్రతను చూపుతోందని వ్యాఖ్యానించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు తెచ్చిన ధాన్యం తడిసిపోతూ నష్టపోతున్నారని, టార్పాలిన్ కవర్లు కొనుగోలు చేసి కప్పుకోవాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఇలాంటి దౌర్భాగ్యకర పరిస్థితులు ఎక్కడా చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుల వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన కేటీఆర్, లేనిపక్షంలో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మరో రెండేళ్లలో తిరిగి తమ ప్రభుత్వం వస్తుందని, అప్పటివరకు రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు.



## హైదరాబాద్ మెట్రో నిర్వహణకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వ నిర్వహణలోకి రానుంది. ఈక్రమంలో మెట్రో రైలు నిర్వహణకు సీఎస్ రామకృష్ణారావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. హెచ్ఎంఆర్ఎల్ నిర్వహణకు అధికారులతో డైరెక్టర్స్ బోర్డు ఏర్పాటు చేసింది. దీనికి ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌కు, జాయింట్ ఎండీగా శివేంద్ర ప్రతాప్‌కు బాధ్యతలు అప్పగించారు.

## జనగణనలో భాగంగా రేపటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్

హైదరాబాద్: జనగణన 2027లో భాగంగా తెలంగాణలో ఈ నెల 26 నుంచి సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హొళికెరి తెలిపారు. సెల్ఫ్‌ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని వివరించారు. ముఖ్యంగా మొదటిసారిగా జనగణన ప్రక్రియలో ఈసారి సెల్ఫ్‌ఎన్యుమరేషన్ ప్రక్రియ పాటిస్తున్నామని.. ప్రజలు నేరుగా



జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు. ప్రజలు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని తెలిపారు. సెల్ఫ్‌ఎన్యుమరేషన్ అనేది తప్పనిసరి కాదని.. కేవలం ప్రజలకు ఒక సౌలభ్యం మాత్రమేనన్నారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ లెక్కిస్తామని భారతీ హొళికెరి అన్నారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియాకు వివరించారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దెభవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందన్నారు. "భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. 2027 ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తాం. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తాం. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారు. ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారు" అని ఆమె పేర్కొన్నారు.

## అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తమ్ముడు

మంథని: తల్లిని ఇంట్లోకి రానివ్వడం లేదని ఆగ్రహంతో అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో జరిగింది. నిద్రిస్తున్న అన్న రఘుపై తమ్ముడు అనిల్



కిటికీలోంచి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో మంటలు చెలరేగి రఘుకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

## కవిత పార్టీ 'టీఆర్ఎస్' పేరుకు దిగువన 'అసోసియేషన్'.. ఎందుకు?

- **నేడు పార్టీ పేరును ప్రకటించిన కవిత**
- **కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలి ఉన్న కవిత పార్టీ**
- **లీగల్ సమస్య రాకుండా ఈ పదాన్ని చేర్చారనే అభిప్రాయాలు**

కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో తన పార్టీని ఈరోజు ప్రకటించిన విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పార్టీ ప్రకటన చేశారు. పాతిక సంవత్సరాల క్రితం తన తండ్రి కేసీఆర్ స్థాపించిన 'టీఆర్ఎస్'




అని వచ్చేలా ఆమె తన పార్టీ పేరును ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. క్లుప్తంగా కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలేలా తన పార్టీ పేరు ఉండేలా కవిత చూసుకున్నారు. కవిత తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించినప్పటికీ, దాని కింద చిన్న అక్షరాల్లో 'అసోసియేషన్' అని కనిపించింది. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలిన నేపథ్యంలో లీగల్ సమస్య రాకుండా ఉండేందుకు కింద అసోసియేషన్ అని చేర్చినట్లు తెలుస్తోంది.

## ఎన్ని పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదు

**: రామచందర్‌రావు**

హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా.. ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా.. భాజపాకు ఇబ్బంది లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. తెలంగాణలో భాజపాకు మంచి వాతావరణం ఉందని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. కవిత కొత్త పార్టీ పెట్టడంపై రామచందర్‌రావు స్పందించారు. భాజపా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.

## అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్

హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు.





## నర్సాపూర్‌లో మంత్రి వివేక్ పర్యటన రసాభాస

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంత్రి వివేక్ పర్యటన రసాభాసగా సాగింది. మహిళలకు నెలకు రూ.2500 ఎప్పుడు పంపిణీ చేస్తారని మంత్రిని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. దీంతో కేసీఆర్ వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని మంత్రి బదులిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు కూడా గత ప్రభుత్వ నిర్వాకమే కారణమని మంత్రి చెప్పారు. దీంతో నేతలిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జిల్లా కలెక్టర్ ప్రతిమా



సింగ్ నచ్చజెప్పినా మంత్రి, ఎమ్మెల్యే వినలేదు. ఇరు పార్టీల నాయకులను నియంత్రించలేక పోలీసులు తంటాలు పడ్డారు.

## 'ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే'.. కవిత కొత్త టీఆర్ఎస్‌పై బీఆర్ఎస్ సెటైర్!

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త రాజకీయ పార్టీ**
- **పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)'గా నామకరణం**
- **ఒరిజినల్, ఫేక్ ఉత్పత్తుల ఫొటోలను షేర్ చేసిన బీఆర్ఎస్**

తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని పేరు పెట్టడంపై బీఆర్ఎస్ పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఈ మేరకు బీఆర్ఎస్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఓ సెటైరికల్ పోస్టు పెట్టింది. కోల్‌గేట్ టూత్‌పేస్ట్, బిస్లేరీ వాటర్ బాటిల్‌కు సంబంధించి ఒరిజినల్, నకిలీ ఉత్పత్తుల ఫొటోలను పక్కపక్కనే జోడించింది. దీనికి "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌ను జత చేసింది. కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెట్టుకున్నప్పటికీ, తామే అసలైన పార్టీ అని బీఆర్ఎస్ ఈ పోస్టు ద్వారా పరోక్షంగా స్పష్టం చేసింది. తమ పార్టీ బ్రాండ్‌కే ప్రజల్లో ఆదరణ ఉంటుందని, కొత్తగా వచ్చిన పార్టీకి కాదని చెప్పకనే చెప్పింది. రాష్ట్రంలో అసలైన తెలంగాణ వాద పార్టీ తమదేనని చాటుకునే ప్రయత్నం చేసింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే








బీఆర్ఎస్ నుంచి ఈ స్పందన వచ్చింది. దీంతో టీఆర్ఎస్ పేరు చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.

## బేగంబజార్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు




హైదరాబాద్: గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. చేపల మార్కెట్ పరిసరాల్లో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఫుట్‌పాత్‌లు, ప్రజా మార్గాలను ఆక్రమిస్తూ నిర్మించిన షెడ్లు, దుకాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని అధికారులు తెలిపారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఈ చర్యలకు దిగినట్లు వెల్లడించారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌లు.. పార్టీలకతీతంగా ప్రజా సేవ

ఖమ్మం (రాయిగూడెం): : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు నిర్ణయించి ప్రజా దర్బార్‌లను ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అన్నిచోట్ల త్రాగునీరు, విద్యుత్ ,ధరణి వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు గాను పాలేరు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా ఎంచుకున్నామని తర్వాతికాలంలో




రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఇటువంటి దర్బార్‌లను నిర్వహించడానికి ప్రధాన కారణం ప్రజా విశ్వాసాన్ని చూరగొనడమే. వారి సమస్యలను తీర్చడమే. పల్లెలు, తండాలు, గ్రామాలు ఇలా అన్ని స్థాయిల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే తీర్చే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.

## గేమర్స్, యువత కోసం జియో న్యూ ప్లాన్..




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికామ్ సంస్థ రిలయన్స్ జియో గేమర్స్‌ను, యువతను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'జియో యూత్ అండ్ గేమింగ్ ప్లాన్' పేరుతో వచ్చిన ఈ ప్లాన్ ధరను రూ.459 గా నిర్ణయించింది. డేటాతోపాటు గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను కూడా ఈ ప్లాన్‌లో అందిస్తున్నారు. ప్లాన్ వివరాల్లోకి వెళ్తే.. రూ.459 రీచార్జ్‌తో 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ సమయంలో వినియోగదారులకు మొత్తం 61 జీబీ హైస్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది.

రోజుకు 2 జీబీ చొప్పున 56 జీబీ డేటాతో పాటు.. అదనంగా మరో 5 జీబీ డేటా కూడా అందిస్తారు. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ ప్లాన్ ద్వారా జియో గేమ్స్, క్లౌడ్ గేమింగ్ యాక్సెస్‌ను మై జియో యాప్‌లో పొందవచ్చు. వీటితోపాటు మూడు నెలలపాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, స్నాప్‌చాట్+ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తాయి. ముఖ్యంగా సుమారు రూ.35,100 విలువైన గూగుల్ జెమినీ ప్రో యాక్సెస్‌ను 18 నెలలపాటు ఉచితంగా అందిస్తుండటం ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణగా చెప్పవచ్చు.

గేమింగ్, సోషల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను ఒకేచోట అందించడం ద్వారా యువత సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని జియో భావిస్తోంది. ఆసక్తి ఉన్న వినియోగదారులు మై జియో యాప్ లేదా జియో అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ ప్లాన్‌ను రీచార్జ్ చేసుకునే అవకాశం ఉన్నది.

## 'పేటీఎం బ్యాంక్' లైసెన్స్ రద్దు..

**మరి యూపీఐ పనిచేస్తుందా?.. క్లారిటీ ఇచ్చిన కంపెనీ**

**పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేసిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

**డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే ప్రధాన కారణమని ఆర్బీఐ వెల్లడి**

**కస్టమర్లు తమ ఖాతాల్లోని బ్యాలెన్స్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చని స్పష్టీకరణ**

**యూపీఐ, క్యూఆర్ కోడ్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం ఉండదని పేటీఎం ప్రకటన**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రద్దు చేసింది. కస్టమర్ల వివరాల సేకరణలో లోపాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆంక్షల ప్రక్రియ చివరికి లైసెన్స్ రద్దుతో ముగిసింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా బ్యాంక్ కార్యకలాపాలు సాగాయని ఆర్బీఐ ఈ నిర్ణయానికి గల కారణాలను స్పష్టం చేసింది.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్బీఐ ఆంక్షలు 2022లోనే మొదలయ్యాయి. తొలుత కొత్త కస్టమర్లను చేర్చుకోవడాన్ని నిషేధించింది. ఈ ఏడాది జనవరిలో ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కొత్త డిపాజిట్లు, క్రెడిట్ లావాదేవీలు, వ్యాలెట్ టాప్-అప్‌లను పూర్తిగా నిలిపివేసింది. 2024 మార్చి 15 నాటికి ఎలాంటి కొత్త నిధుల స్వీకరణను అనుమతించలేదు. దీంతో బ్యాంకింగ్ కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోయాయి. అప్పటి నుంచి కేవలం ఖాతాల్లో ఉన్న నగదును విత్‌డ్రా చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఉంది. తాజా లైసెన్స్ రద్దుతో బ్యాంక్ కార్యకలాపాలు అధికారికంగా ముగిసినట్లయింది.

ఈ సందర్భంగా ఆర్బీఐ కీలక వ్యాఖ్యలు చేసింది. "బ్యాంక్ యాజమాన్యం తీరు ప్రజా ప్రయోజనాలకు, డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకును కొనసాగించడానికి అనుమతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు" అని తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

వన్97 కమ్యూనికేషన్స్, పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌లో వరుసగా 51%, 49% వాటాలు ఉన్నాయి. 2015 ఆగస్టులో ఈ బ్యాంక్‌కు లైసెన్స్ లభించింది. నిబంధనల ప్రకారం ఈ బ్యాంక్ చిన్న మొత్తంలో డిపాజిట్లు స్వీకరించగలదు కానీ రుణాలు ఇవ్వలేదు.

### కస్టమర్లపై ప్రభావం ఉందా?

పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ రద్దు తమ వ్యాపారంపై ఎలాంటి ఆర్థిక ప్రభావం చూపదని పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ స్పష్టం చేసింది. ఆర్బీఐ ఆంక్షల తర్వాత పేటీఎం తన ప్రధాన చెల్లింపుల సేవలను బ్యాంకింగ్ విభాగం నుంచి వేరు చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతితో భాగస్వామ్య బ్యాంకుల ద్వారా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను కొనసాగించడానికి అనుమతి పొందింది. పేటీఎం తన యూపీఐ హ్యాండిల్‌ను యెస్ బ్యాంక్ నేతృత్వంలోని మల్టీ-బ్యాంక్ వ్యవస్థకు మార్చింది. దీంతో కస్టమర్ల యూపీఐ చెల్లింపులు, క్యూఆర్ కోడ్ లావాదేవీలు, బిల్లు చెల్లింపులు వంటి రోజువారీ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వీటికి ఎలాంటి అంతరాయం ఉండదు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు తమ ఖాతాల్లో ఉన్న బ్యాలెన్స్‌ను ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, కొత్తగా డబ్బు డిపాజిట్ చేయడం లేదా వ్యాలెట్ టాప్-అప్ చేయడంపై ఆంక్షలు కొనసాగుతాయి. మొత్తం మీద పేమెంట్స్ బ్యాంక్ మూతపడినప్పటికీ, పేటీఎం యాప్ ప్రధాన సేవలు నిరంతరాయంగా పనిచేస్తాయి.

## ఆంత్రోపిక్‌లోకి గూగుల్ భారీ పెట్టుడులు




**న్యూఢిల్లీ:** సంచలనాల ఏఐ స్టార్టప్ సంస్థ ఆంత్రోపిక్‌లో గూగుల్ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఈ టెక్ దిగ్గజం 40 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆంత్రోపిక్ అధికారికంగా ప్రకటించింది.

ఒప్పందం ప్రకారం తొలుత 10 బిలియన్ డాలర్లను ఆంత్రోపిక్‌లోకి గూగుల్ మళ్లించనుంది. మిగతా 30 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ పనితీరుపై ఆధారపడి ఉంటుంది. ఆంత్రోపిక్‌తో తమ సహకారాన్ని మరింత పెంచుకోనున్నట్లు ఇటీవల అమెజాన్ సంస్థ ప్రకటించింది. దానిలోభాగంగా తొలుత 5 బిలియన్ డాలర్లు, పనితీరు లక్ష్యాలు సాధిస్తే మరో 20 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఇటీవల వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గూగుల్-ఆంత్రోపిక్ ఒప్పందం గురించి ప్రకటన వచ్చింది. ఇప్పటికే ఈ రెండు కంపెనీల మధ్య ఉన్న పొత్తు.. ఈ డీల్‌తో మరింత విస్తరించనుంది. కస్టమ్ గూగుల్ చిప్స్, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసెస్‌ను వాడుకొని ఆంత్రోపిక్ తన సాంకేతిక సామర్థ్యాలను మరింత పెంచుకోనుంది.

# ఛేజింగ్‌లో కింగ్స్..

**రికార్డు లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించిన పంజాబ్..!**

**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్‌లో ఓటమెరుగని పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రను తిరగరాసింది. ప్రత్యర్థి మారినా, లక్ష్యం ఎంతైనా సరే అలవోకగా ఛేదిస్తున్న పంజాబ్ ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక స్కోర్‌ను ఉఫ్‌మనిపించి రికార్డు నెలకొల్పింది. కేఎల్ రాహుల్(152 నాటౌట్) సెంచరీతో 265 పరుగుల సవాల్ విసిరిన ఢిల్లీకి షాకిస్తూ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్(76), ప్రియాన్ష్ ఆర్య(43)లు ఆకాశమే హద్దుగా చెలరేగి విజయానికి బాటలు వేశారు. స్వల్ప వ్యవధిలోనే మూడు వికెట్లు పడినా.. శ్రేయాస్ అయ్యర్(71 నాటౌట్) మరోమారు కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఆరు వికెట్లతో విక్టరీ కొట్టని పంజాబ్ 13 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.





ఐపీఎల్-19లో పంబాజ్ కింగ్స్ ధాటికి రికార్డులు బద్దలైపోతున్నాయి. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని కరిగించేసి రికార్డు పట్టేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోర్‌తో గెలుపుపై ధీమాతో ఉండగా.. మేము ఎంతైనా కొట్టేస్తామంటూ పంజాబ్ హిట్టర్లు జట్టుకు ఆరో విజయాన్ని కట్టబెట్టారు. రికార్డు ఛేదన కావడంతో తొలి నాలుగు ఓవర్లలో ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య(43), ప్రభ్‌సిమ్రన్ సింగ్(76)లు ఇరగమరగ దంచేశారు. నబీ వేసిన తొలి ఓవర్లో చెరొక సిక్సర్ బాదిన .. ఆపై ముకేశ్ కుమార్ ఓవర్లో తలొక సిక్సర్‌తో ఢిల్లీకి హడలెత్తించారు. అక్షర్ పటేల్‌ను ఉతికేసిన ప్రియాన్ష్ 4, 6, 6తో ఇవరై రన్స్ పిండుకున్నాడు. అయితే.. ఉతుకుడే మంత్రగా సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని అక్షర్ విడదీసి ఢిల్లీకి బ్రేకిచ్చాడు.


అనంతరం కుల్దీప్ యాదవ్(2-46) వరస ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్, కూపర్ కొన్నొల్లీను ఔట్ చేసి పంజాబ్‌ను ఒత్తిడిలో పడేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(71 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ నేహల్ వధేరా(17)లు.. బాధ్యత తీసుకున్నారు. విప్రజ్ నిగమ్ ఓవర్లో వధేరా ఔటైనా దూకుడు తగ్గించని అయ్యర్ కుల్దీప్ ఓవర్లో వరసగా రెండు సిక్సర్లు బాది ఈ సీజన్‌లో మూడో అర్థ శతకం సాధించాడు. అంతే.. కొండంత లక్ష్యం చూస్తుండగానే మంచుముక్కలా కరిగిపోయింది. నట్టూ వేసిన 19వ ఓవర్లో శశాంక్ సింగ్(19 నాటౌట్) ఫోర్, అయ్యర్ సిక్సర్ బాదగా మరో ఓవర్ ఉండగానే ఆరు వికెట్లతో పంజాబ్ జయభేరి మోగించింది.

### రాహుల్ అజేయ శతకంతో..

సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్(152 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగి శతకంతో గర్జించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో అభిమానులను బౌండరీల వర్షంలో మంచెత్తిన రాహుల్ పంజాబ్ కింగ్స్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించాడు.

పటిష్టమైన పంజాబ్ బౌలింగ్ దళాన్ని తుత్తునియలు చేసిన రాహుల్.. రెండో వికెట్‌కు నితీశ్ రానా(91)తో కలిసి 220 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఇన్నిగ్స్ ఆఖరి ఓవర్లో బౌండరీ ఢిల్లీ భారీ స్కోరందించాడు.


## ఫుల్ ఫిట్‌నెస్ కోసం కఠోర శ్రమ..



**ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆడతాడు!**

**న్యూఢిల్లీ:** ముంబయి ఇండియన్స్ అభిమానులకు గుడ్‌న్యూస్. చివరిసారిగా ఏప్రిల్ 12న ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో గాయపడిన రోహిత్ శర్మ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఏప్రిల్ 29న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌లో రోహిత్ ఆడతాడని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. అందుకోసం రోహిత్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచులకు రోహిత్ బెంచ్ పైనే ఉన్నాడు. సీఎస్‌కేతో ఆడతాడని అంతా భావించినా.. మేనేజ్‌మెంట్ మాత్రం రిస్క్ తీసుకోలేదు. మరో నాలుగు రోజుల సమయం ఉండటంతో అప్పటికి ఫుల్ ఫిట్‌నెస్ సాధిస్తాడని ముంబయి ఇండియన్స్ పేర్కొంది. సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ ఐపీఎల్ 2026 సీజన్‌ను మెరుగ్గానే ప్రారంభించాడు. నాలుగు మ్యాచుల్లో 165 స్ట్రైక్‌రేట్‌తో 137 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. కానీ, గాయం కారణంగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. మరోవైపు ఓపెనింగ్‌కు వచ్చిన డికాక్ దూకుడుగా ఆడుతున్నా.. నాన్‌స్ట్రైకింగ్ నుంచి పెద్దగా సహకారం లభించడం లేదు. రోహిత్ ఉంటే ముంబయి ఇండియన్స్‌కు బెనిఫిట్ అవుతుందనేది అభిమానుల ఆకాంక్ష. ఇప్పటికి ఏడు మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన ముంబయి పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. మిగతా ఏడు మ్యాచుల్లో కనీసం ఒక్కటి ఓడినా.. ప్లేఆఫ్స్ అవకాశాలు గల్లంతు అయినట్లే.

## ఆ స్కోరు చాలనుకున్నాం.. విరాట్ మైండ్‌సెట్ అదే: గుజరాత్ కోచ్



**న్యూఢిల్లీ:** ఏదైనా మ్యాచ్ ముగిసిన తర్వాత గెలిచినా.. ఓడినా ఆయా జట్లు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టడం సహజం. పరాజయం చవిచూసిన జట్టు ఎందుకు అలా జరిగిందో వివరణ ఇస్తుంది. కానీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓటమిని చవిచూసిన గుజరాత్ టైటాన్స్ ప్రధాన కోచ్‌కు మాత్రం కేవలం విరాట్ గురించి మాత్రమే ప్రశ్నలు ఎదురుకావడం గమనార్హం. ఎందుకంటే తొలి బంతికే విరాట్ ఇచ్చిన క్యాచ్‌ను జీటీ ఫీల్డర్ వాషింగ్టన్ సుందర్ వదిలేశాడు. దీంతో 81 పరుగులు చేసిన కోహ్లీ తన జట్టును గెలిపించాడు. ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం గుజరాత్ అసిస్టెంట్ కోచ్ విజయ్ దహియా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా విరాట్ క్యాచ్‌ను డ్రాప్ చేయడం వల్లే తమకు ఈ పరిస్థితి వచ్చిందన్నాడు.

"ఓడిన తర్వాత ప్రతిఒక్కరూ చెప్పే మాట స్కోరు బోర్డు మీద మరిన్ని పరుగులు ఉంచితే బాగుండేది. మేం గెలిచేవాళ్లం అని అంటారు. అయితే, ఆర్సీబీతో మ్యాచ్‌లో మా ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత ఈ టార్గెట్‌ను కాపాడుకోగలమని భావించాం. విరాట్ కోహ్లీని తొలి బంతికే ఔట్ చేసే అవకాశం వచ్చింది. కానీ, దానిని అందుకోలేకపోయాం. మా నుంచి మ్యాచ్‌ను లాగేశాడు. సుదీర్ఘ అనుభవం కలిగిన ప్లేయర్లు కేవలం తమ అనుభవంతోనే సర్వైవ్ అవుతారు. పరిస్థితులను ఎలా అలవాటు చేసుకోవాలో వారికి బాగా తెలుసు. అందుకు విరాట్ కోహ్లీ మంచి ఉదాహరణ. కుర్రాళ్ల నుంచి అనుభవజ్ఞుడైన క్రికెటర్ స్ఫూర్తి పొందాల్సిన అవసరం లేదు. వారికి వారే ఇన్‌స్పైర్ అవుతారు" అని దహియా వెల్లడించారు.

"సుదీర్ఘ కాలంగా విరాట్ కోహ్లీ తన దూకుడును కొనసాగించడానికి కారణం అతడి మైండ్‌సెట్. ఇప్పటికీ అదే ఎనర్జీతో ఉండటం అద్భుతం. ఆటపై అవగాహన, మంచి నైపుణ్యానికి తోడు ఉత్సాహం కలిసొస్తే ఎలా ఉ ంటుందో విరాట్‌ను చూస్తే అర్థమవుతుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లీతో మాట్లాడా. అతడు చాలా నిరుత్సాహంతో 'భారీ ఇన్నింగ్స్‌ను సెంచరీగా మార్చలేకపోయా' అని బాధ పడ్డాడు. ఇన్నేళ్ల కెరీర్‌లో ఇలాంటివి ఎన్నో చేశావని బదులిచ్చా. దీనిని కూడా మరో కోణంలో చూడమని సలహా ఇచ్చా. తొలి బంతికే ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడి.. క్లిష్టమైన పిచ్‌పై విరాట్ చాలా సులువుగా పరుగులు రాబట్టేశాడు.

# ఇషాన్, అభిషేక్ విధ్వంసం...

**రాజస్థాన్‌పై సన్‌రైజర్స్ సంచలన విజయం**

**రాజస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్**

**వైభవ్ సూర్యవంశీ విధ్వంసక శతకంతో రాజస్థాన్ భారీ స్కోర్**

**భారీ లక్ష్య ఛేదనలో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకాలు**

**18.3 ఓవర్లలోనే 229 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్**



**జైపూర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద పారించిన మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలన విజయం సాధించింది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం అందుకుంది. తొలుత రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (103) విధ్వంసక శతకంతో చెలరేగగా, రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం సన్‌రైజర్స్ బ్యాటర్లు ఇషాన్ కిషన్ (74), అభిషేక్ శర్మ (57) మెరుపు అర్ధశతకాలతో లక్ష్యాన్ని చిన్నదిగా మార్చేశారు. 229 పరుగుల భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు కేవలం 18.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

229 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తొలి ఓవర్‌లోనే ట్రావిస్ హెడ్ (6) వికెట్ కోల్పోయి షాక్ తగిలింది. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశారు. పవర్ ప్లే ఓవర్లను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. అభిషేక్ శర్మ 29 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 57 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ కేవలం 31 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 74 పరుగులు చేశాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు కేవలం 55 బంతుల్లోనే 132 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేసింది.

వీరిద్దరూ ఔటయ్యాక, హెన్రిచ్ క్లాసెన్ (29), నితీష్ కుమార్ రెడ్డి (18 బంతుల్లో 36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టును విజయానికి చేరువ చేశారు. చివరి ఓవర్లలో ఒత్తిడి పెరిగినా, సలీల్ అరోరా (3 బంతుల్లో 8 నాటౌట్) ఒక సిక్సర్ కొట్టి మరో 9 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ చెరో రెండు వికెట్లు తీశారు. వైభవ్ అద్భుత శతకం వృథాగా మిగిలింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే యశస్వి జైస్వాల్ (10) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 37 బంతుల్లోనే 5 ఫోర్లు, ఏకంగా 12 సిక్సర్లతో 103 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతనికి మరో ఎండ్‌లో ధ్రువ్ జురెల్ (35 బంతుల్లో 51) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

చివర్లో డొనోవన్ ఫెరీరా (16 బంతుల్లో 33) కూడా మెరుపులు మెరిపించడంతో రాజస్థాన్ భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో కమిన్స్ పొదుపుగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయగా, ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టాడు.

